బూటకపు హామీలను నమ్మొద్దు

ఇబ్రహీంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

- హామీలపై కాంగ్రెస్, బీజేపీ నేతలను నిలదీయాలి
- జహీరాబాద్‌లో గులాబీ జెండాఎగరాలి
- ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు
- గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం

న్యాల్‌కల్, ఏప్రిల్ 29: కాంగ్రెస్, బీజేపీల బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని రాఘవాపూర్, ఇబ్రహీంపూర్, చినిగేపల్లి, అత్మూర్, డప్పూర్, మల్గి, రత్నాపూర్, మరియంపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంతో విఫలమయ్యాయన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మోసం చేసేందుకు మళ్లీ ప్రజల్లోకి వస్తున్న ఆయా పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. పదేండ్ల బీజేపీ పాలనను ప్రజలు చూశారని, ఆ పార్టీతో తెలంగాణకు ఒరిగిందేమి లేదని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు మిధున్‌రాజ్, నర్సింహారెడ్డి, సంగ్రాంపాటిల్, ఎంఆర్ ప్రవీణ్‌కుమార్, భూమారెడ్డి, అశోక్, యూసుఫ్, సునీల్, రాజు, సిధారెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవికుమార్, మారుతీయాదవ్, ఎంపీటీసీ శివానంద శ్రీపాతి, సిద్దమ్మ, రమేశ్ పాల్గొన్నారు.

అందోల్: అందోల్-జోగిపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మునిపల్లి: మొగ్దుంపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ హోరు.. ప్రచార జోరు

అందోల్, ఏప్రిల్ 29: కారు గుర్తుకు ఓటేసి.. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీపీ రామాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మల్లికార్జున్‌గుప్తా, నాగభూషణం అన్నారు. సోమవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి అందోల్-జోగిపేటలో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో తిరుగుతూ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌కు మద్దతు ఇవ్వాలని ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగురాలని అందుకు ప్రజలందరూ కారుగుర్తుకు ఓటేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఓటేయాన్నారు. కార్యక్రమంలో నాయకులు చాపల వెంకటేశం, సంతోశ్, మహేశ్‌యాదవ్, బీర్ల శంకర్, రొయ్యల సత్యం, శ్రీనివాస్, ఖాజా పాషా, గోరే, శంకర్‌రావు, ఇమ్రాన్, విజయ్ కుమార్, మల్లేశం, రమణ, కృష్ణ, సాయిలు, రాకేశ్, గణేశ్, మహావీర్ పాల్గొన్నారు.

అనిల్ కుమార్‌ను గెలిపించాలి

మునిపల్లి, ఏప్రిల్ 29: బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, మునిపల్లి మండల ప్రధాన కార్యదర్శి మంతురి శశికుమార్ కోరారు. ఆదివారం రాత్రి మండలంలోని మొగ్దుంపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలిస్తేనే అభివృద్ధిని వేగవంతం చేసుకోవచ్చన్నారు.

ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 29: బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

హుస్సేల్లి చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

న్యాల్‌కల్, ఏప్రిల్ 29: మండలంలోని హుస్సేల్లి గ్రామ శివారులోని అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద రూ.54,500 నగదును పోలీసులు పట్టుకున్నారు. హద్నూర్ ఎస్ఐ రామనాయుడు కథనం ప్రకారం.. సోమవారం స్థానిక చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనంలో రూ.54,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో చెక్‌పోస్టు పోలీసులు నగదును సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

హుస్సేల్లి చెక్‌పోస్టు వద్ద నగదును పట్టుకున్న పోలీసులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గుమ్మడిదల, ఏప్రిల్ 29: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గుమ్మడిదల మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద ఎన్నికల అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి 765డీపై ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రయాణికులు కూడా అధికారులకు సహకరించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో తనిఖీలు నిర్వహించే అధికారులకు తాగునీరు, టెంట్ ఫ్యాన్ లాంటి కనీస మౌలిక వసతులను కల్పించాలని పలువురు అధికారులు జిల్లా ఎన్నికల అధికారులను కోరుతున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, అంజన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్ దంపతులు

అందోల్, ఏప్రిల్ 29: అందోల్-జోగిపేట మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ పిట్ల భాగ్యలక్ష్మి, లక్ష్మణ్ దంపతులు సోమవారం మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి వారికి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టే అభివృద్ధి విషయంలో కలిసి పనిచేయాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్కుఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య పాల్గొన్నారు.



మంత్రి దామోదర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ దంపతులు

బీరప్ప కామరాతి కల్యాణంలో మంత్రి

పుల్కల్, ఏప్రిల్ 29: మండల కేంద్రం పుల్కల్‌లో సోమవారం ఘనంగా బీరప్ప కామరాతి కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమానికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మంత్రికి శాలువా, పూలమాలతో సత్కరించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఆలయ ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, సీనియర్ నాయకుడు బోయిని శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు మన్నె విట్టల్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రజాక్, ఉపాధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్, ఏప్రిల్ 29: మండలంలోని చీకూర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, పాండురంగారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జహీరాబాద్‌లో ఎంపీ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్ సమక్షంలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీఎస్ ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్ హైమద్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ చంద్రప్ప, పీఏసీఎస్ మండల చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి, ఎంపీపీ వైస్ చైర్మన్ గౌసుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, రఫీయొద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం

హత్నూర, ఏప్రిల్ 29: మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుముదిరాజ్‌కు మద్దతుగా హత్నూర మండలంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని సిరిపుర, తెల్లరాళ్లతండా, గోవిందరాజ్‌పల్లి, చీక్‌మద్దూర్, కొన్యాల, పన్యాల, లింగాపూర్, బడంపేట, నవాబుపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి నీలం మధుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ ఆంజనేయులు, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీం మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కర్రె కృష్ణ, నాయకులు దుర్గారెడ్డి, వెంకటేశం, మనిదీప్, శివరాజ్, సందీప్, రాజు పాల్గొన్నారు.

తెల్లరాళ్లతండాలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిన్నారంలో జన జాతర సభ

జిన్నారం, ఏప్రిల్ 29: మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా మండల కేంద్రం జిన్నారంలో ఆదివారం రాత్రి కాంగ్రెస్ జన జాతర సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ బీసీ బిడ్డ నీలం మధును మెదక్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ ఎంపీగా గెలిపిస్తే ఇంట్లో సభ్యుడిగా ఉంటూ అభివృద్ధికి పాటుపడుతానన్నారు. అనంతరం ఊట్ల గ్రామానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్ జింకల శివరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ గంగురమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వీరారెడ్డి, మద్ది ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

ప్రచార రథంపై మాట్లాడుతున్న గాలి అనిల్‌కుమార్, మనూరులో సమావేశానికి హాజరైన పలు గ్రామాల ప్రజలు

- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది
- జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్

మనూరు, ఏప్రిల్ 29: రాష్ట్రంలోని గ్రామాలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే అభివృద్ధి చెందాయని జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి మనూరు మండల కేంద్రంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హామీలు అమలుచేయడంలో విఫలం అయ్యిందని ఆరోపించారు. డిసెంబర్ 9వ తేదీన రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ఇప్పటికీ రైతు బంధు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని, జహీరాబాద్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరడం కాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు మనూరు మండల కేంద్రంలోని పెట్రోల్ పంప్ నుంచి స్థానిక చౌరస్థ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రచార సమన్వయ కర్త మటం భిక్షపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు, నాయకులు నాగేందర్ రావు, పలు గ్రామాల నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడపగడపకూ ఓటరు స్లిప్పుల పంపిణీ

బొల్లారం, ఏప్రిల్ 29: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో గడపగడపకూ వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, ఆర్వో శ్రీధర్ తెలిపారు. జిల్లా రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు మున్సిపాలిటీని సంబంధిత బీఎల్వోల ద్వారా 34 పోలింగ్ బూత్‌లలో రెండు రోజులుగా గడపగడపకు వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 30వేల మంది ఓటర్లకు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని బీఎల్ఓలను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో బీఎల్వోలు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కంకరి శ్రీను(ఫైల్)

హత్నూర, ఏప్రిల్ 29: చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రమైన హత్నూర శివారులోని చాకిచెరువులో సోమవారం చోటుచేసుకుంది. హత్నూర పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాబుపేట గ్రామానికి చెందిన కంకరి శ్రీను(36) ఆదివారం పశువులను మేపేందుకు వెళ్లి ఇంటికి రాలేదు. కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం తెల్లవారుజామున చెరువులో మృతదేహం గుర్తించారు. పశువులను నీటిలో కడుగుతున్న క్రమంలో నీటమునిగి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడికి భార్య మంజుల, కూతురు హారిక ఉన్నారు. మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు

కోహీర్, ఏప్రిల్ 29: మండలంలోని దిగ్వాల్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై కృష్ణయ్య కథనం ప్రకారం.. ఝరాసంగం మండలంలోని గినియార్‌పల్లి గ్రామానికి చెందిన అమీన్(50) సోమవారం దిగ్వాల్ గ్రామానికి వచ్చాడు. తన ఎక్సెల్ బైక్‌పై జహీరాబాద్‌కు వెళ్లే క్రమంలో బస్టాప్ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి జహీరాబాద్ వైపునకు వెళ్లే కారు అతడి బైకును అతి వేగంగా ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్రగాయాలై ఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. అతడి తండ్రి మస్తాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సర్కిల్ మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎండీ గౌస్

గౌస్‌కి స్వీట్ తినిపిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, ఏప్రిల్ 29: బీఆర్ఎస్ సర్కిల్ మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా బొంబాయికాలనీకి చెందిన ఎండీ గౌస్‌ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా ఎండీ గౌస్ ఎమ్మెల్యేతోపాటు కార్పొరేటర్లు పుష్పానగేశ్, సింధూఆదర్శ్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎండీ గౌస్‌ని సన్మానించి అభినందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి దోహదపడాలని సూచించారు. సర్కిల్ మైనార్టీ ప్రధానకార్యదర్శిగా నియమించినందుకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లకు ఎండీ గౌస్ కృతజ్ఞతలు తెలిపారు. సర్కిల్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

రాజకీయాల్లో మాదిగలకు ప్రాధాన్యమివ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డితో చంద్రశేఖర్, తదితరులు

కోహీర్, ఏప్రిల్ 29: రాజకీయాల్లో మాదిగలకు ప్రాధాన్యమివ్వాలని మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. కాంగ్రెస్ బాబూ జగ్జీవన్ రామ్‌ను ఉప ప్రధాని, ఏఐసీసీ అధ్యక్షుడిని చేసిందని పేర్కొన్నారు. మీరాకుమార్‌ను లోక్‌సభ స్పీకర్‌గా, దామోదర రాజనర్సింహను ఉమ్మడి రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిని చేసిందన్నారు. కాంగ్రెస్ దళితులకు తల్లిలాంటిదని, మాదిగలకు అవకాశాలు కల్పిస్తామని సీఎం భరోసా ఇచ్చారని వివరించారు. రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని కలిసి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఆయన వెంట సతీశ్ మాదిగ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

భర్తే హత్యచేశాడని మృతురాలి తండ్రి ఫిర్యాదు

మంగ(ఫైల్)

అందోల్, ఏప్రిల్ 29: బొమ్మ బొరుసు ఆట ఓ వివాహిత ప్రాణాలు తీసింది. ఆటకు అలవాటు పడిన భర్త తన విలువైన వస్తువులు, నగలు అమ్మి ఆ డబ్బులు మొత్తం ఆటలో పోగొట్టడాన్ని ప్రశ్నించిన భార్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అందోల్‌కు చెందిన బోయిని అశోక్, మంగ(26) భార్యాభర్తలు.. అశోక్ తన భార్య నగలు, ఇతర వస్తువులు అమ్మి వచ్చిన డబ్బుతో బొమ్మ బొరుసు ఆడి మొత్తం పోగొట్టాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య గొడవ జరిగడంతో అశోక్ మంగను బూతులు తిట్టి తీవ్రంగా కొట్టాడు. సోమవారం ఆపస్మారక స్థితిలో ఉన్న మంగను కుటుంబ సభ్యులు జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి బట్టయ్య ఫిర్యాదు మేరకు అల్లుడు అశోక్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అందోల్ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో కొన్ని నెలలుగా బొమ్మబొరుసు ఆట విచ్చలవిడిగా నడుస్తున్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఈ విషయంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

చాప్ట(కె)లో వ్యక్తి దారుణ హత్య

కంగ్టి, ఏప్రిల్ 29: కంగ్టి మండలంలోని చాప్ట(కె) గ్రామ శివారులో వ్యక్తిని హత్య చేసి మృతదేహాన్ని పొలంలో పడవేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ విశ్వజన్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. కంగ్టి మండలం ముర్కుంజాల్ గ్రామానికి చెందిన వడ్డె సంజీవ్(40)ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి గ్రామ శివారులో మృతదేహాన్ని పడేశారు. సంజీవ్‌ను గొంతుకోసి, ముఖంపై బండరాయితో కొట్టిచంపినట్లు మృతదేహాన్ని చూస్తే తెలుస్తున్నదని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నారాయణఖేడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిన్నారం సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఏడీఈ శ్రీకాంత్

కరెంట్ కోతల నివారణకు చర్యలు

జిన్నారం, ఏప్రిల్ 29: వేసవిలో కరెంటు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని గుమ్మడిదల ఏడీఈ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం జిన్నారం సబ్ స్టేషన్‌లో వేసవిని దృష్టిలో పెట్టుకొని 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏడీఈ శ్రీకాంత్ జిన్నారం ఏఈ రాజు నాయక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వేసవిలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్నదన్నారు. నాణ్యమైన కరెంటును అందించేందుకు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఈ ఏడీఈ రామస్వామి, ప్రొటెక్షన్ ఏడీఈ వెంకటేశ్, బొంతపల్లి ఏఈ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారులదే కీలక పాత్ర

సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జి తివారి

మాట్లాడుతున్న గోపాల్ జి తివారి, పక్కన జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 29: లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులదే కీలక పాత్ర అని సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జి తివారి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి సెక్టోరియల్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా, పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలన్నారు. పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్ని చదివి తెలుసుకోవాలన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా శిక్షకులతో నివృత్తి చేసుకోవాలని, నిర్లక్ష్యంగా ఉండరాదని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్వో పద్మజారాణి, సెక్టోరియల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీబీ పాటిల్‌ను గెలిపించాలి

ఇంటింటి ప్రచారంలో వచన పాటిల్

న్యాల్‌కల్, ఏప్రిల్ 29: జహీరాబాద్ ఎంపీగా మరోసారి బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ మహిళా మోర్చ నాయకురాలు వచన పాటిల్ అన్నారు. సోమవారం మండలంలోని గుంజోట్టి, వడ్డి గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశాభివృద్ధి నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో సమస్యలు పరిష్కారం కావాలంటే మరోసారి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మంగళవారం అల్లాదుర్గం మండలంలో నిర్వహించే నరేంద్రమోదీ బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఓంకర్‌యాదవ్, గుంజోట్టి ఎంపీటీసీ దేశెట్టి పాటిల్, నాయకులు పాండురంగారావుపాటిల్, బస్వరాజ్‌పాటిల్, మల్ల